
# వెలుగు చూసిన వ్యక్తులు




మా. గోఖలే

శ్రీరామమూర్తి మద్రాసులో ఎమ్. ఎస్‌సి. ఫిజిక్సు చదువుతూ వేసంగి సెలవలకు రైలులో నాగరాజుపాలెం వద్ద దిగి, కూలివాడిని పెట్టె, బెడ్డింగు తెమ్మని, రెండు మైళ్ళ దూరంలో వున్న స్వగ్రామం బంగారుపల్లెకు నడకసాగించాడు.

అది ఉదయం వేళ ఎనిమిది గంటల సమయం. యింకో గంట పోతే వేసంగి సెగ ప్రారంభం కావచ్చు. ప్రస్తుతానికి ఆ కంకర రోడ్డు చెట్ల మధ్య వస్తుంటే రోడ్డు ప్రక్క పొలాల్లో

అక్కడక్కడ పచ్చగా వున్న వారుమళ్ళ మీదుగా చల్లటిగాలి తగులుతున్నది. హుషారుగా అనుకోని సంతోషంతో మనసు నిండింది శ్రీరామమూర్తికి- పట్నం తన్ని పల్లెటూరి వాతావరణం మనిషికి మెరుగన్న భావంతో.

స్వగ్రామం బంగారుపల్లె ఊరి బయట ముప్పాతిక మైలు దూరంలో రోడ్డు మీదుగా గొడ్ల పిల్లకాయలు గొడ్లతో అప్పుడే వచ్చి రోడ్డు పక్కల్ని మేపుకుంటూ చెట్ల మీద కోతికొమ్మంచి కొంత మంది, చెట్ల కింద బచ్చాలాట యింకొంతమందీ ఆడుకుంటం గమనించాడు నడిచి వస్తున్న శ్రీరామమూర్తి.




"ఏ ఊరు?" అనడిగింది వదహారేళ్ళు వచ్చిన పిల్ల కనకం- బచ్చాలాట ఆపి

"ఆ కనపడే మీరొచ్చిన ఊరే," అన్నాడు శ్రీరామమూర్తి,తీర్చిదిద్దినట్టుండి మోకాళ్ళదాకా చీరె దోపుకున్న కనకాన్ని వింతగా చూస్తూ.

"ఎవరి పిల్లగాడివి?" అడిగింది కనకం, ఆనవాయితీ ప్రకారం.

"శివశాస్త్రి బాబాయి అన్న కొడుకును. మా అమ్మ, నాన్నలు చిన్నప్పుడే పోయినారు. నువు మా ఊరి పిల్లవి కాదల్లే వుందే." అన్నాడు శ్రీరామమూర్తి.

"నా ఊరు గుంటూరుకు పదిమైళ్ళ దూరంలో వుంటది. నీ చివశాస్త్రి బాబాయి యీడ యిస్కోలు మాస్టారు అవటాన నా కెవ్వుడైనా సందేల పాటాలు చెబుతాడు——" అని కనకం అంటుండగా గొడ్లపిల్లకాయ రంగడు "ఎహే, ఎహై- బర్రెగొడ్లు నాగయ్యగారి నారుమళ్ళకాడికి ఎల్తావుంశయ్. ఒగెత్తవేందిరా ఎంకటాయ్- కనకం, నీ దున్నపోతుల జత, సూడి బర్రె కూడా వుండయ్ ఒగెత్తు- ఒగెత్తు-" అనరిచాడు నారుమళ్ళవేపు పరుగెత్తుతూ. వెంటనే ఆ గొడ్లపిల్ల కాటోలు వెనక పైకి దోపుకున్న చీరెతో పరుగెత్తుతున్న కనకాన్ని వింతగా చూస్తున్న శ్రీరామమూర్తి తన పెట్టె, బెడ్డుతో ముందుపోతున్న కూలివాడు "వూరు దెగ్గిర కొచ్చింది. యిగరావయ్యా పెద్దమడిచి-" అని అరవటం విని తొందరపడి బంగారుపల్లె వేపు కదిలాడు.

ఊరి మొదట్లో పెద్ద మండువాలోగిలి బయట పెద్ద ప్రహరీగోడ- గేటుపక్క పెద్ద రాతి అరుగుమీద చుట్ట కాలుస్తూకూచున్న

*With Best Compliments for*

**DEEPAVALI**


# M/s. SURESH FURNITURES

**D. No. 30-15-138, Opp. Divisional Engineers Phones,**

**DABAGARDENS, VISAKHAPATNAM-20**

**"Steel Alamars, Teak & Rose Wood Furnitures (Double Cots, Single Cots, Dyning Tables & Dressing Tables) Sofa-Cum-Beds, Chairs and Tables, Folding Pipe Cots and Folding Dyning Tables and Easy Chairs etc. are always available with fair and reasonable Rates at our Shop".**

**MOSTLY WELCOME PLEASE**




ఊరి పెద్ద యాభై అయిదేళ్ళ పెద రామయ్య "చివ శాత్త్రిరిగారి అన్న కొడుకు శ్రీరామమూర్తివి గదూ నువ్వు? పెన్నాపట్టంలో సదువుతున్నావంటగా?" అనడిగాడు శ్రీరామమూర్తిని, పద్ధతి ప్రకారం.

"అవును రామయ్య పెదనాన్నా. ఎమ్.ఎస్‌సి. మొదటేడు పరీక్షలై నయి-వేసంకాలం సెలవుల కొస్తున్నా" అన్నాడు శ్రీరామమూర్తి పెద్దరికం పాటిస్తూ.

"అబ్బో పెద్ద సదువేనే! ఆడ సాన కరుజవుద్దనుకొంటా! మీ బాబాయిని సిక్కుల్లో పెట్టకుండా కాత్తె ఒల్లు దెగ్గిర పెట్టుకుని బాగా సదవాల, తెల్సిందా? ఎల్లిరా—" అన్నాడు పెదరామయ్య పెద్దమనిషి తీరులో.

యింటికి చేరంగానే బాబాయి శివశాస్త్రి, కాముడు చిన్నమ్మల క్షేమం తెలుసుకున్న శ్రీరామమూర్తిని "పరీక్షలు బాగా రాసినట్టేనా?" అనడిగాడు బాబాయి శివశాస్త్రి.

"రాసినట్టే బాబాయ్— ఎక్కడా అప్పీలు వుండటానికి వీల్లేదుగా!" అన్నాడు శ్రీరామమూర్తి, నవ్వుతూ.

ఆ సాయంత్రం శ్రీరామమూర్తితో అన్నాడు శివశాస్త్రి బాబాయ్, "నీకు మంచి రోజులు ముందు వుంటయ్యని నేనాశపడ్తా రాముడూ నీ భార్య నీకుదక్కకుండా పోవలసింది కాదు, మీ నాన్న అమ్మలుపోతూ ఆస్తి పాస్తులకు అప్పులు మిగల్చటం జరక్కుండా వుండవలసింది. ప్రస్తుతం మీ ఆర్థిక సదుపాయాలు కరుగ్గా వున్నాయి వున్నాయిమరి- ఆ వివరాలన్నీ నీ బుర్రకు ఎక్కించటం లేదనుకో. మిగిల్న మీ ఆస్తి ఆరెకరాల్లో ఒక ఎకరం అమ్మితే కాని నీ చెల్లెలు అన్నపూర్ణ పెళ్ళిజరిగింది కాదు. నీ లాగానే నా పెద్దన్న సుబ్బారావు వద్ద వాడి యిద్దరాడ పిల్లల్తో పాటు నీ తమ్ముడు ప్రసాదు వుంటూ యీ ఏడు గట్టెక్కితే వచ్చేఏడు యింటర్లో చేరినట్టే. మీ బాధ్యతల్ని సక్రమంగా నడపటం మా వంతైనా మీ ముందు జీవితాలు బాగుపడేందుకు గట్టి ప్రయత్నాలు చేసుకోటం మీ అన్నదమ్ముల వంతు కొంతా, ఈశ్వరాను గ్రహం కొంతా వుండక తప్పదని కోరుకుంటున్నాను."

వారం అయినాక ఒక సాయంత్రం రోజూ వస్తున్న అరడజను ట్యూషను విద్యార్థులతో పాటు ఆ రోజు కనకం కూడా వచ్చి వసారాలో ఓ మూల కూచునుంటం, లోపల హాల్లో పడక్కుర్చీలో కూచుని చిన్నమ్మ యిచ్చిన కాఫీ తాగుతున్న శ్రీరామమూర్తి చూశాడు.

"నేను మన ఊరు వచ్చేప్పుడు దార్లో గొడ్లపిల్ల కాయల్తో వున్న ఆ కూచున్న కనకాన్ని చూశాను. మనవూళ్ళో ఆ పిల్లను ముందెప్పుడూ చూళ్ళేదు చిన్నమ్మా. ఆ పిల్ల నన్నెంతో అమాయకంగా పలకరించింది—ముందెప్పుడూ నన్ను చూడకపోయినా" అన్నాడు శ్రీరామమూర్తి కాఫీ కొంత పుచ్చుకుని.


"ఆ పిల్ల కనకానిది గుంటూరుకు పదిమైళ్ళలో వున్న ఓ పల్లెటూరు. ఆ పిల్ల తండ్రికి, మన వూళ్ళో వున్న బసవపున్నయ్యకు చుట్టరికాలు వుంటంవల్లా బసవ పున్నయ్యకు కాస్త ఆస్తి వుంటంవల్లా యిరవై ఏళ్ళ తన కూతురు కన్న పెద్దవాడైనా కనకాన్ని బసవపున్నయ్యకిచ్చి యీ మధ్య పెళ్ళి చేశాడు ఆ పిల్ల తండ్రి. కాని కనకం చేసుకున్న బసవపున్నయ్య ఆరోగ్యం అంత మంచిదల్లే కనిపించదు. ఈ మధ్య ఓ నెల రోజులు పడకవేసినట్టున్నాడు బసవపున్నయ్య." అంది కాముడు చిన్నమ్మ, పక్కనే కూచుని చాటలో బియ్యంలోని మట్టిగడ్డల్ని ఏర్తూ.

"మనిషనే వాడికి ఎక్కడో, ఎందుకో అనారోగ్యం కలగవచ్చు" అన్నాడు శ్రీరామమూర్తి- ఎటూ మొగ్గకుండా.

"దగ్గర ఆందుబాట్లోవున్న యిద్దరు వైద్యులకు బసవపున్నయ్యను చూపించారట గానీ బస్తీకి తీసుకెళ్ళి చూపిస్తే మంచిదన్నార్ట ఆ వైద్యులు. 'అదే సర్దుకుంటుందిలే' అని బసవపున్నయ్యఅన్నా ఆ పిల్లను వదల్దం యిష్టంలేక కావచ్చు యిక్కడి వారనుకుంటున్నారు" అంది కాముడు చిన్నమ్మ.

"పల్లెటూరు తత్వాలు అదో రకంగా వుంటయ్ ఆ పిల్లకు చదువు ధ్యాస వున్నట్టుంది అత్త మామలు, మొగుడుకు యిష్టం వుంటుందా?" అన్నాడు శ్రీరామమూర్తి.

"కొత్త కోడలు- వారికి యిష్టం లేకుండా పన్లు చేస్తుందా? తన పుట్టింట తనకు చదువుధ్యాస వుండేదని చెప్పేదట. మన పల్లెటూరి బడాయి కూడా తమ కోడలు చదువొచ్చిన పిల్లని చెప్పుకునే మోజు కూడా వుండేటటువంటిదే." అంటూ వంటింటో ఎసట్లో బియ్యం



పోయటానికి వెళ్ళింది కాముడుచిన్నమ్మ.

ప్రయివేటు చెపుతున్న శివశాస్త్రి పొడుంకాయలోంచి ముక్కు పొడుం రాలకపోటం చూసుకుని తొందరగా కోమటి దుకాణం దగ్గరకు వెళ్ళి వస్తానని పిల్లకాయల్ని చదువుతుండమని బయటికి వెళ్ళగానే- కనకం తను చూసుకుంటున్న రెండు పుస్తకాలు అక్కడ పెట్టి హాల్లో కొచ్చింది.

"అమ్మగారు లోనికెళ్ళారా-యింతకు ముందలే యీతుంటం చూశానే?" అంది కనకం శ్రీరామమూర్తిని చూసి.

"ఇప్పుడే మళ్ళీ రావొచ్చు— అవసరంగా పనేమైనా వుందా?" అడిగాడు శ్రీరామమూర్తి.

"బావనల్లం వుందంట, నిన్న యిత్తానంది మంచినీల బావికాడ."


"నేనడిగి తెచ్చిపెట్టనా— లేకపోతే నువు పాఠం అయి వెళ్ళేముందు తీసుకు పోవచ్చు. ఏమిటి నువు చదువుతున్నది?"

"సిన్న సదువు. నా అన్న కేశవులు ఎనక కాత్తె సెప్పేవోడు. నీ సదువు సెన్నాపట్టంలో నంటగా? నీది పెద్ద సదువనికూడా సెప్పింది మీ సిన్నమ్మ. నిన్న మంచినీల బావికాడ."

"బళ్ళో చదివే పెద్ద చదువులు అనేవి కడుపులు నింపుకునే వుద్యోగాల కోసమేనని నా వుద్దేశ్యం. లోకజ్ఞానం, సంస్కారం అబ్బే చదువు దారివేరు."

"నా కేశవులన్న కాత్తె లేడాగా అదే మాటనేవోడు! వత్తా— సదువుకోవాలి— ఎల్లేముంగల బావనల్లం అడిగి తీసికెల్తా—" వెళ్ళి వసారాలో వున్న చెల్లెల్తో కలిసింది కనకం.

'కనకానికి చదువు ధ్యాస యింకా వుందేమిటి? అన్న కేశవులు చదువు చెప్పేవాడంటుంది; కాని బసవపున్నయ్యను పెళ్ళి చేసుకున్నాక బుద్ధిమారాలి కదా? మొగుడు రోగిష్టివాడని తెలిసినాక మొహంలో మార్పు కనుపించాలి! కాని చీమకుట్టినట్టు లేకుండా బర్రె గొడ్లని మేపటం, యింటి పనులు చేయటం చదువుపట్ల కూడా మనసు వుంచుకుంటున్నది. కనకానికి చిన్న పిల్ల లక్షణాలు పోలేదా? పెళ్ళి అనుభవం కలగలేదా? లేక యీ పిల్ల పిచ్చిదా?' అని కనకం గురించిన ఏవో ఆలోచనలు కొన్ని కలక్క




పోలేదు శ్రీరామమూర్తికి.

'తనకు పదహారో ఏటే బాబాయివాళ్ళు పెళ్ళి చేశారు. కాని రెండేళ్ళ క్రితం చచ్చిపోయింది తన భార్య తులసి. తులసి మంచి పిల్ల అయి వుండవచ్చు. తనను ఎంతో కనిపెట్టి చూసినట్టు అనుకున్నాడు తను. తులసిలో తను మొగుడనే భావం బాగా వున్నట్టు కాముడు చిన్నమ్మ అనేది. కాని సమాజం, లోకం, చదువు, సంస్కారం గురించి చిన్నమెత్తు తెలుసుకుంటం ఎరుగదు తులసి. కాని తనకు క్షయ పట్టుకుని తను క్షీణ అవుతున్నా కుమిలేదికాదు అలాగే తీసుకుంటూ పోయింది.' అనుకున్నాడు శ్రీరామమూర్తి.

శివశాస్త్రి పిల్లల ట్యూషను ముగించి, వంటింట్లో భార్యనడిగి బావనల్లం తెచ్చి కనకానికిచ్చి పంపేసి, శ్రీరామమూర్తి పక్కన ఒక నులక మంచం వాల్చి నిట్టూరుస్తూ కూలబడ్డాడు.

"ఒరే రాముడూ, నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకో. నీ కన్న పెద్దవాణ్ణి. నీ మేలు కోరే ఆలోచనలు కలవాణ్ణి గనుక ఎందుకిలా అంటున్నానో కాస్త గ్రహించు" అని కాస్త ముక్కుపొడుం పీల్చాడు శివశాస్త్రి బాబాయి.

"నా చిన్నతనంలో ఒకసారి చేశారు; యిప్పుడూ అదే ధోరణిలో నన్ను యిరికించటం యిప్పట్నుంచే ఎందుకు బాబాయ్? యిప్పుడు నాకా ధ్యాసలేదు—"

"లేకపోవచ్చు; కాని మనిషి జన్మకు భార్యాభర్తల రూపంలో జీవితాలనేవి నిండుగా వుంటూ ప్రయాణిస్తూ వుంటాం. మనం పరిశీలిస్తే విషయాలు తేలిగ్గా యిట్టే తేలి పూరుకుంటాయి! మన కాలం ఎప్పటికైనా అదేనని నీకు నేను చెప్పక తప్పదు." అని మరొకసారి కాస్త ముక్కుపొడుం పీల్చాడు శివశాస్త్రి బాబాయి.

"ఆ కాలం వచ్చిందనిపిస్తే నేను బయటపడ్తాలే బాబాయ్" సందిగ్ధంగా తర్కాన్ని కుదించాడు శ్రీరామమూర్తి.

కొద్దిరోజుల్లో గుంటూర్లో పెత్తండ్రి వద్ద వున్న తమ్ముడు ప్రసాదునూ, అక్కడికి పదిమైళ్ళలో ఓ పల్లెటూర్లో కాపురం చేస్తున్న చెల్లెలు అన్నపూర్ణనూ చూసి, బంగారుపల్లె తిరిగివచ్చి, తొందర్లోనే మద్రాసు ప్రయాణం అయినాడు శ్రీరామమూర్తి— కాలేజీ తెరుస్తారు గనుక.

రెండెడ్లబండి స్టేషనుదాకా ఎక్కనన్న శ్రీరామమూర్తి పెట్టె, బెడ్డింగు ఒక కూలివాడికి తగిలించి, వూరి బయటిదాకా సాగనంపటానికి వచ్చిన శివశాస్త్రి



బాబాయి "నీ విషయం బాగా ఆలోచించి యింకో మంచి సంబంధం గురించి విచారిస్తున్నాను. నువు మద్రాసు వెళ్ళిన కొద్ది రోజులకు వుత్తరం రాస్తాను. పెద్దవాళ్ళ మాట తిరస్కరించకురా చిట్టితండ్రీ!" అని శ్రీరామమూర్తి చెవిన యింకోసారి వేసి వూళ్ళోకి తిరిగి వెళ్ళాడు.

కొన్ని సొంత విషయాలు అంతగా తనకు పట్టకపోయినా శివశాస్త్రి బాబాయి శ్రద్ధగా తన విషయాలు ఎక్కువగా పట్టించుకుంటాడని శ్రీరామమూర్తి మనసు అనుకోకపోలేదు.

జూన్ నెల ముగిసే సమయం. పొలాల్లో నాట్లపనులు ముమ్మరంగా సాగటం చూసిన శ్రీరామమూర్తి మనసు మళ్ళీ చాలా కాలానికి చిందులేసింది. ఆ నాట్ల మనుషుల్ని చూస్తూ. రోడ్లపక్క వేయటానికొచ్చిన బర్రెగొడ్లు సాయంకాలం యిళ్ళకు తిరిగి వెళ్తుంటే వాట్ని చూసుకునే గొడ్లపిల్లకాయల్తోబాటు కనకం వాళ్ళ చివర్న పేడబుట్టతో కనిపించింది శ్రీరామమూర్తికి.

"ఏం కనకం, చాలా రోజులకు కనుపించావు మళ్ళీ. నేను చదువుకు మద్రాసు వెళ్తున్నా." అన్నాడు శ్రీరామమూర్తి. కనకం దగ్గరకు రాగానే.

"నాకు తెలుసు నువు మద్రాసు వెళ్తావని" అంది కనకం నెత్తిన పేడబుట్టతో నుంచుంటూ.

"నీకు తెలుసని అనుకోలేదు. మీ ఆయన బసవపున్నయ్య ఆరోగ్యం బాగుందా? నాకెందుకో మీ యింటికొచ్చి బసవపున్నయ్యను పలకరించ బుద్ధిపుట్ట లేదు."

"ఎందుకనేం!"

"మీ ఆయన నీకన్న చాలా పెద్ద. తను రోగిష్టివాడని తనకు తెలిసే నిన్ను పెళ్ళి చేసుకున్నా డనిపించింది నాకు— ఎందుకనో. ఆ విషయం నీ మనసుకు ఎక్కినట్టు కూడా నువ్వు కనిపించవు నాకు" అనేశాడు శ్రీరామమూర్తి.

"మా గురించి నువు సానా అనుకుంటావే? పోనీ అంతే సాలు యిప్పటికి! ఆయనకు వొంట్లో బొత్తిగా బాగుండం లేదు తనకు ఒంట్లో ఏం లేదంటాడు యియాల్టికి కూడా" అంది కనకం. విచారం బయట పడకుండా.

"కనకం, మీ క్షేమం బాబాయికి తెలుపుతే నాకు రాసే జాబులో తెలుపుతుంటాడు యింక నీతో ఎక్కువ మాట్టాడలేను— వస్తా-" అంటూ ముందుకు కదిలివెళ్తున్న శ్రీరామమూర్తిని వెనక నుంచి కాసేపు చూసిన కనకం వెళ్ళి బర్రెగొడ్ల పిల్లకాయల్తో కలిసింది.

"తన స్వజాతకంపై తనకెలాంటి అధికారం లేదు. ఆధికారంతో తను జీవితాన్ని అదుపు చేసుకునేది మటుకు తనకు స్వజ్ఞానం మీద నమ్మకం వున్ననాడే సాధ్యం!" అనుకున్నాడు ఓ రోజు శ్రీరామమూర్తి మద్రాసులో. తనకు శివశాస్త్రి బాబాయి రెండో పెళ్ళి చేసిన కొద్ది రోజులకు.

తనకు నీలవేణి అనే పిల్లతో రెండో పెళ్ళి. తను రెండో వర్షం మద్రాసు వచ్చిన రెండు నెలలకే జరగటం, శివశాస్త్రి బాబాయి తనను గురించి అధికంగా ఆలోచించటం వల్లనే సాధ్యమయింది. తనకు శివశాస్త్రి బాబాయి 'శ్రీరామ రక్షంత


దీపావళి శుభాకాంక్షలు!

పూర్ణా ఆగ్రో ఇండస్ట్రీస్ అండ్ ఆయిల్స్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు : గాంధీనగర్, విజయవాడ-3.

ఫ్యాక్టరీ : రేణింగవరము, అద్దంకి తాలూకా, ప్రకాశం జిల్లా.

ఫోన్స్ : 73388
72291

గ్రామ్స్ : "పూర్ణా ఆయిల్స్"
టెలెక్స్ : 0475 223


పూర్ణా ప్రత్తి విత్తనముల రిఫైండ్ ఆయిలు మరియు తౌడు, నూనె ఉత్పత్తి చేయుటయు, నూనె తీయబడిన ప్రత్తి విత్తనముల కేకు, తౌడు కేకు మరియు ఇతర విధములైన కేకులను విదేశములకు పంపు వ్యాపారము.

పెట్టు' అననుకున్నాడు శ్రీరామమూర్తి.

అందుకే తను మద్రాసులో చదువుతున్నా ఆటంకాలు అంతగా వుండవని నీలవేణితో ఓ చిన్న అద్దెయింట్లో కాపురం పెట్టించాడు బాబాయి శివశాస్త్రి. కాని ఒక పైశాచిక చర్య-తనపైవిరుచుకుపడ్తుందనితనకెందుకుతడ్తుంది? పెళ్ళయి కొత్తగా కాపురంపెట్టిన రెండు వారాలకే నీలవేణి న్యుమోనియా తగిలి చచ్చిపోయింది. అకస్మాత్తుగా! ఇది పిచ్చి పుట్టించే సంఘటన. ఈ సంఘటన తన హస్తముద్రిత జాతకరేఖల్లో ముందే నిర్ణయించబడిందా?

కాని ఈ సంఘటనతోబాటు తనకు కలిగిన అనుభవాలు కొన్ని తనను వెంబడించక పోలేదు : తనతో కొత్తగా కాపురాని కొచ్చిన నీలవేణి తనతో మనసు కలిపిన ధోరణి చూపలేదు. రాత్రిళ్ళు పక్కలో తనకు మనసిచ్చినట్టు అనిపించలేదు. నోరెత్తి ఏ సందర్భంలోనూ మనసిచ్చి మాట్లాడేది కాదు. తమకు జరిగిన పెళ్ళి గురించి- తను ఎలా ప్రవర్తిస్తున్నా- తను ఏమనుకుందీ ఆ పిల్ల మాట మాత్రం అనలేదు. యిది ఏ రకం తత్వం? ఏ రకం తత్త్వం వున్న పిల్లనయినా కాబోయే మొగుడుకన్న శివశాస్త్రి బాబాయి నిర్ణయానికి బరువు ఎక్కువగా వుంటుందా?

నీలవేణి మరణించిన వార్తవిన్న రెండోరోజుకే శివశాస్త్రి బాబాయి, కాముడు చిన్నమ్మలు మద్రాసువచ్చి, శ్రీరామమూర్తి వద్ద యిరవైరోజులుండి, అతన్ని ఓదార్చవలసినంత ఓదార్చి, స్వగ్రామం తిరిగి వెళ్ళిపోయారు. బంగారుపల్లె చేరిన నాలుగు రోజులకు ఒక వుత్తరం తన




క్షేమం తెలుపమని రాస్తూ, చివర్న రెండు ముక్కలు తెలిపాడు. తాము మద్రాసులో వుండగా బసవపున్నయ్య పోయినాడనీ, తాము బంగారుపల్లె చేర్తుండగా కనకం తన పుట్టింటికి మొగుడుపోయిన పదిహేనో రోజుకు- వెళ్ళిపోయిందనీ రాశాడు బాబాయి.

కనకానికి బసవపున్నయ్యతో పెళ్ళి అసహ్యం, తల ఎత్తుకోలేనిదైతే—అతని చావు కనకానికి కుమిలిపోయేందుకు బాగా వుపయోగపడ్తుందనుకున్నాడు శ్రీరామమూర్తి. తనకు యిరవై రెండేళ్ళ వయస్సులో రెండు పెళ్ళిళ్ళు అయి, మానసిక ఆవేదన, వ్యర్థ జీవితం అనుభవించిన మనసు తనను రచనలకు దారియించింది. బాహ్య జీవితంలో కొన్ని ప్రముఖ రచనలు తన మనసులో సంచలనం కలిగించటం, రచనా విధానం తనలో పరివర్తన కలిగించటం- కొంతకాలం నుంచి జరుగుతున్నా తనురచనలుచేయడంకు ప్రయత్నిస్తూ యిటీవలే తనచర్యల్లో కొంతపట్టు సాధించగలిగాడు. హైదరాబాదులో వుంటున్న శ్రీహరి అనే మిత్రుడు యిటీవల రెండు తెలుగు వారపత్రికల్లో ప్రచురించబడ్డ తన రెండు కథల్లో రజాకార్ల గురించి తాను రాసినవి తననువ్రద్ధి క్తుణ్ని చేసినదని తెలిపాడు.

తన ఎమ్.ఎస్‌సి. ఫిజిక్సు ఫైనలు పరీక్షల్లో తను ఎలా రాయకలిగిందీ తెలుసుకుందామనే తాపత్రయం శ్రీరామమూర్తికి కలగలేదు. వేసంగికి మద్రాసు కాళీచేసి, బంగారుపల్లె వచ్చి శివశాస్త్రి బాబాయి, చిన్నమ్మలను చూసిన రెండో రోజుకు అక్కడ వుండలేక గుంటూరు వెళ్ళి పెదనాన్న వాళ్ళను, తమ్ముడు ప్రసాదును చూసి, అక్కడికి పదిమైళ్ళ దూరం పల్లెటూరులో చెల్లెలు అన్నపూర్ణను కూడా చూసి రావటానికి బయలుదేరాడు శ్రీరామమూర్తి.

చెల్లెలు అన్నపూర్ణకు ఆ మధ్య గర్భస్రావం కలిగి విచారంలో వున్నది కాస్తా అన్న శ్రీరామమూర్తిని చూసి ఆనందం పట్టలేక తన విచారాలన్నిటినీ మింగి, ఒక నెల అయినా అన్న అక్కడ లేకపోతే మర్యాద దక్కదని— వీధిలో పోయేవారి చెవిన పడేంత బిగ్గరగా అరచి చెప్పింది.

అన్నపూర్ణ భర్త కామేశ్వరరావు బి. ఎ. బి. యిడి. చదివి బస్తీలో వుద్యోగంలో వుంటున్నా తండ్రి పోవటం వల్ల పల్లెటూరు వచ్చి, పదిహేనెకరాల సుక్షేత్ర భూమిని కనిపెటుకు కూచోక తప్పలేదు. బావమరిది శ్రీరామమూర్తి సామాన్య సంఘ జీవిగాకున్నా ఒక మెట్టు పైనుండే వర్ధుచువాడని ఎప్పుడో గ్రహించిన బావ కామేశ్వరరావు బావమరిది తన పల్లెటూరు రానే వచ్చాడని చదువు, సాహిత్యం రాజకీయాలు, లోకాన్నావరించిన సిద్ధాంతాల్ని గురించి రెండు రోజులు ఏకధాటిగా చర్చలు పేల్చేశాడు అతనితో.

మూడో రోజు సాయంకాలం తన పొలాలవేపు వెళ్ళి వద్దామని బావమరిది శ్రీరామమూర్తితో వూరు బయటకు కంకర రోడ్డు మీద వచ్చిన కామేశ్వరరావు, రోడ్డుకు అడ్డంగా పార్తున్న చిన్న పంట కాలవ పైన షుమారైన ఒంతెన మీద కాకీ చొక్కా, కాకీ పాంటు వేసుకుని మాసిన గడ్డంతో కూచుని వున్న ఒక వ్యక్తిని చూసి బాగా దగ్గర కొచ్చిగాని గుర్తు పట్టలేదతన్ని.

"ఓస్- నువ్వా కేశవులూ! చాలా మారిపోయినా వేంటి దగ్గర కొచ్చినా అంత తేలిగ్గా గుర్తుపట్ట వీలులేకుండా! చాలా కాలమైంది మనం కలుసుకొని. ఎప్పుడొచ్చావీ వూరికి?" పాత మిత్రుణ్ని పలకరించాడు కామేశ్వరరావు.

"బాగుండావా కామేశం అన్నా? నా చెల్లెలు మొగుడు పోయినాడని తెలిసి నిన్న వచ్చా. చాలా అన్యాయం జరిగింది దానికి" కుంగిన మనిషల్లే అన్నాడు కేశవులు.

"నీ చెల్లెలు యిక్కడకు చేరినాక చూశాను కేశవులూ. చాలా అందంగా

వుండే నీ చెల్లికి ఒక విధంగా నీ తండ్రి చాలా అన్యాయం చేసినమాట నిజం— నువేమనుకున్నా సరే." అన్నాడు కామేశ్వరరావు.

"నువు అన్నది నిజంఅని నాకెప్పుడో తెలుసు కామేశం అన్నా. ఆ చచ్చిన వాడికి చెల్లిని యివ్వద్దని మొరాయిచ్చి చివరకు పెళ్ళికి వెళ్ళకుండా యింకో వూరెళ్ళాను. అప్పట్లో చెల్లి ఏం తెలుసుకునేది కాదు"అన్నాడు కేశవులు-పల్లెటూరి మనస్థితుల్ని అధిగమించిన వాడై.

"అప్పట్లో నీ చెల్లి నిజంగా అమాయకురాలే- కాని వారం కిందట నేను మాట్లాడినప్పుడు ఆ పిల్లలో చాలా మార్పు వచ్చినట్టు అనిపించింది నాకు. ఇతను నా బావమరిది శ్రీరామమూర్తి. మద్రాసులో మొన్న ఎమ్.ఎస్.సి.ఫైనలు పరీక్ష రాసివచ్చాడు."అన్నాడు కామేశం కేశవులకు బావమరిదిని పరిచయంచేస్తూ.

"నీ చెల్లెలిపేరు కనకం కదూ?" అడిగాడు శ్రీరామమూర్తి కేశవుల్ని సూటిగా చూస్తూ.

"అవును. కనకాన్ని నువు ఎరుగుదువా? నీది బంగారుపల్లె అనుకుంటా" శ్రీరామమూర్తిని పరీక్షిస్తూ అన్నాడు కేశవులు.

"అవును. బడిపంతులు మా శివశాస్త్రి బాబాయి యింటివద్ద చదువుతుంటానికి వచ్చినప్పుడూ, రెండుసార్లు బర్రెగొడ్లు కాచుకునేప్పుడూ మీ కనకాన్ని చూడటం, పలకరించడం జరిగింది. విచిత్రమైన పిల్ల. ఒకసారి నాతో చెప్పింది కూడా నువు తనకు చదువు చెప్పేవాడివని.

మీ యింటికొచ్చి ఒకసారి కనకాన్ని చూడవచ్చా- ఆ పిల్ల మొగుడు పోయినప్పుడు నేను మద్రాసులో వున్నా."

"నువ్వు కేశవుల్తో వాళ్ళింటికి వెళ్ళి కనకాన్ని చూసిరా శ్రీరామమూర్తి— నాకు అవసరంగా పొలం పనున్నయ్—పనవుతే నేనుకేశవులింటికొస్తా. కేశవులు చానా మంచి మెకానిక్: హైదరాబాదులో మంచి వుద్యోగంలో వున్నాడు—నేను వస్తా—" కామేశ్వరావు వెళ్ళగానే కేశవుల్తో వాళ్ళ యింటికి వెళ్ళాడు శ్రీరామమూర్తి.

కేశవులు తల్లి తండ్రులుండే సొంత పూరిపాక చిన్న తోటలో వుంది. కేశవులు లోపల వంటింట్లో తల్లి వద్ద వున్న కనకంతో చెప్పగానే, పంచలో నులక మంచం మీద కూర్చున్న శ్రీరామమూర్తి దగ్గర కొచ్చి —అతన్ని కన్నార్పకుండా వింతగా చూస్తూ నిలబడిపోయింది.

"మీది ఈవూరని, నిన్ను యిక్కడ చూడగలనని—పొరపాట్న కూడా అనుకోలేదు కనకం! నా బావ కామేశ్వరరావు ద్వారా నీ అన్న కేశవుల్తో పరిచయం అయి యిక్కడికి రాగలిగాను. నేను మద్రాసులో వుండగా బంగారుపల్లెలో నీకు భర్తపోయిన విషయాలు శివశాస్త్రి బాబాయి వుత్తరం రాశాడు, నీ గురించి ఎక్కువగా బాధపడ్డాను."అన్నాడు శ్రీరామమూర్తి,కనకంకళ్ళల్లోకి చూడగలుగుతూ.

"బసవ షన్నయ్యతో నాకు పెల్లయిందని అనిపించటం లేదు. ఆయన మంచాన పడి తీసుకుంటూ పోవటం మటుకు నాకు లోన తొలిసింది! నేననుకోలేదు—మీరిక్కడ నన్ను సూట్టాని కొత్తారని." అంది కనకం గోడకు ఆనుకుని,

"నాకీ మధ్య రెండో పెళ్ళికూడా అయి మద్రాసులో కాపరం పెట్టిన కొద్దిరోజులకే ఆ పెళ్ళాం న్యుమోనియా తగిలి పోయింది. నాకు ఎక్కడా ఎక్కువ రోజులు వుండ బుద్ధిపుట్టక నా చెల్లెలు.బావ దగ్గరకొచ్చాను."అన్నాడు శ్రీరామమూర్తి స్వవిషయం కదిపిస్తూ.

"నాకు తెలుసు నీ రెండో పెళ్ళాం పోవడం." అంది కనకం—తల వొంచుకొని.

కేశవులు శ్రీరామమూర్తిని అడిగాడు. "యిటీవల'రామ్'అనే రచయిత మద్రాసు వార పత్రికల్లో హైదరాబాద్ రజాకార్ల కిరాతకాలను గురించి రెండు కథల్ని రాసినవి చదివాను—అతనెవరో నీకు తెలుసా?"


"తెలుసు.ఆ రజాకార్ల గురించి ప్రత్యక్షానుభవం వుంటే యింకా మంచి కథలు రాయవచ్చు. శ్రీహరి అనే నా సన్నిహిత మిత్రుడు ఆ కథలు చదివి నాకోలేఖ రాశాడు: 'ఆ కథలు బాగున్నవనీ. తను రజాకార్ ఘోరహంతకులకు వ్యతిరేక వుద్యమంలో వున్నానని' రాశాడు." అన్నాడు శ్రీరామమూర్తి.

"నీపేరు 'రామ్' అనే పొట్టిపేరుకు కుదించుకున్నావనుకుంటా." అంది కనకం.

"యిటీవలే కథలు రాయడం మొదలు పెట్టాను. శ్రీహరిని చూడాలని నా మనసు పీకుతున్నది.—బహుశ తొందర్లో ఆపని చేస్తాను." అన్నాడు శ్రీరామమూర్తి.

"నువు అట్టే బాధపడకుండా అతన్ని చూడొచ్చు—నాతో కలిసివస్తే. మేమిద్దరం యింకా చాలా మందిమి కలిసి రహస్యంగా అక్కడి అడవుల్లో వుంటూ రజాకార్ల హంతకులతో పోట్లాడుతున్నాం. ఆడవాళ్ళను నడిబజార్లో చెరచడం, ప్రజల్ని నరికి ముక్కలు చేస్తూ యిళ్ళమీద పడి దోచుకోటం అక్కడివారికి నిత్యకృత్యమైంది. రక్తం తాగే హంతకుడు కాశీం రజ్వీ వాళ్ళకు నాయకుడు. ఇంగ్లీషు వాళ్ళు మన దేశం వొదిలి వెళ్ళేకాలం వచ్చినా తన పరిపాలన కాశీం రజ్వీవల్ల స్థిరంగా వుంటుందని నైజాం నవాబు చంక లెగరేస్తున్నాడు. వాళ్ళ అంతం చూడంది మేం వుద్యమాన్ని వదలమని 'సంఘం'లో శపథం చేశాము." అన్నాడు కేశవులు.

"నేను అన్నతోపోయి ఆడ సంఘంలో సేర్తుండానని అన్నకాడ సెబదం సేశా."



## కాంతి ధార

వీథి వీథులలోన సౌధ వేదులమీద
దీపికాశ్రేణుల తీర్చి దిద్ది—
గుడిసె ముంగిటకూడ కూర్మి మీరగ
నొక్క—
క్రొంగ్రొత్త ప్రమిదను కుదురుపరచి—
కారుచీకట్లను కకుబంతములదాక
దయమాలి మాటికి తరిమికొట్టి -
అను నిమేషంబును పెనుపారి పీడించు
మశకాది క్రిములను మారిమసగి -
వానకారున మాలిన్యధానియైన
భూత ధాత్రిని కాంతి ప్రపూరధార
ధౌతమును జేసి యారోగ్యభూతి
గూర్చు
పుణ్య దీపావళీ ! కీర్తిపుష్టి నీకు !

— శనగన నరసింహస్వామి

## :-చెప్పేయి:

ఒక పల్లెటూరు ఆసామి చెప్పుల షాపులోకి వెళ్ళి తనకు నచ్చిన జోడు తొడుక్కున్నాడు. షాపులోనే ఇటు, అటు నడిచి చూసి షాపువాడితో—

"ఏమిటండి! కాళ్ళు మంటలు పుడుతున్నాయి" అన్నాడు.

"ఒక వారం రోజులు అట్లాగే వుంటాయండి!" అన్నాడు షాపువాడు.

"అయితే ఒక వారం రోజులు ఆగే వస్తాను. అట్టిపెట్టండి!" అంటూ చక్కా వెళ్ళిపోయాడు.

— వి. సుమలత, విజయనగరం

"అక్కడకు వెళ్ళి శ్రీహరి మాదిరి సంఘంలో చేరటానికి నేను మద్రాసులోనే శపథం చేశాననుకోండి—అయినా నువ్వక్కడకు వెళ్ళటం నాకాశ్చర్యంగా వుంది కనకం!" అన్నాడు శ్రీరామమూర్తి కనకంతో సూప్ కలుపుతూ.

"ఇవాల్టి కనకాన్నా- నాకు తెలిసినంతగా నువు ఎరగవు శ్రీరామమూర్తి. అది నాతో పోరాటానికి రావటం ఖాయమైంది." అన్నాడు కేశవులు.

"ఈ సారి కనకం యిష్టప్రకారం ఆ పిల్లను ఎవరు పెళ్ళిచేసుకోగలిగినా అతను అదృష్టజాతకుడే. నాది ముదనష్ట జాతకం అని లోగడ నాకు జరిగిన రెండు పెళ్ళిళ్ళకే నా భవిష్యత్తు తేలిపోయింది!" అన్నాడు శ్రీరామమూర్తి.

"ఎనక జరిగిన రెండు పెళ్ళిళ్లు నువు మనసు పడి చేసుకున్నవి కావు. యిహాల ఏపిల్లమీద నీకు మనసు మళ్ళినా ఆ పిల్ల కానా అదృష్టవంతురాలు," అంది కనకం.

"నువు చెప్పింది నిజమవుతే ఆ పిల్ల కనకానికి మించింది కావటానికి వీల్లేదు!" అన్నాడు శ్రీరామమూర్తి, కేశవులు తన బుజం మీద చెయివేస్తుంటే.


"HEARTY DEEPAVALI GREETINGS"

mdl
A Joint Venture
of A. P. I. D. C.

M/s. MAHAVIKRA DYES LIMITED
INDUSTRIAL AREA, KURNOOL ROAD,
ONGOLE-523 002

A Joint Venture with A. P. I. D. C. which has gone into production manufacturing the following 'TARA BRAND' Vat Dyes and Intermediates.

Vat Jade Green FFB    Violet RR
Olive Green B    Pure Benzanthrone
3 - Bromo Benzanthrone